ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 21 జనవరి 2025



ముగింపు సభలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, వేదికపై ఎమ్మెల్యేలు, నాయకులు, సినీనటులు, అధికారులు

ప్రకృతి.. సంస్కృతి ప్రభుత్వ ప్రాధాన్యాలు

- ఈ దిశగానే పర్యాటక అభివృద్ధి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్


కృతిశెట్టి నృత్యం


అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


సంయుక్త మీనన్

సూళ్లూరుపేట/తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని సంస్కృతిని గుర్తుపెట్టుకోవడమే కాకుండా వాటి ద్వారా పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయాలన్నదే కూటమి ప్రభుత్వం ఉద్దేశమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సూళ్లూరుపేట కళాశాల మైదానంలో సోమవారం జరిగిన మూడు రోజుల పక్షుల పండుగ ముగింపు సభలో ముఖ్య అతిథిగా మంత్రి మాట్లాడారు. తమ ప్రభుత్వం పర్యాటకరంగాన్ని ప్రోత్సహిస్తుందని, అందులో భాగంగానే నాలుగేళ్లుగా నిలిచిపోయిన పక్షుల పండుగను మళ్లీ నిర్వహించామని తెలిపారు. ఎన్నో వేల కిలోమీటర్లు ప్రయాణించి ఈ ప్రాంతానికి వచ్చే విదేశీ వలసపక్షుల విన్యాసాలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంటాయన్నారు. అందుకే 2001లో అప్పటి తమ టీడీపీ ప్రభుత్వం పక్షుల పండుగను ప్రారంభించిందని గుర్తుచేశారు. వైసీపీ నిలిపేసిన ఈ పండుగను తమ ప్రభుత్వం వచ్చిరాగానే తిరిగి ప్రారంభించాలని చంద్రబాబు ఆదేశించారన్నారు. సీఎం సూచనల మేరకు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించామన్నారు.

క్లుప్తంగా ప్రసంగాలు

ముగింపు రోజున సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించేందుకు ప్రజలు పోటెత్తి వచ్చారు. సూళ్లూరుపేట కాలేజీ మైదానం నిండిపోయి, ప్రజలు బయటకూడా బారులు తీరారు. సినీరంగానికి చెందిన కళాకారులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ఆపి సభను ప్రారంభించారు. ఇటువంటి సందర్భంలో ఎక్కువ సేపు ఉపన్యాసాలు మంచిది కాదనే ఉద్దేశ్యంతో మంత్రి తర్వాత ప్రసంగించిన వారంతా సంక్షిప్త సందేశాలతో ముగించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పండుగ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఇక జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సైతం ఎమ్మెల్యే విజయశ్రీని అనుసరించి ముగించేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సైతం 'ఇప్పుడు మమ్మల్ని పట్టించుకునే పరిస్థితి జనాలకు లేదు' అంటూ ధన్యవాదాలతో ముగించారు. హీరోయిన్లు సంయుక్త మీనన్, కృతిశెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మంగ్లీ పాట హుషారెత్తించింది.


హుషారెత్తించిన మంగ్లీ పాట

హాజరైన ఐదుగురు ఎమ్మెల్యేలు

ముగింపు సమావేశంలో గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, చీరాల ఎమ్మెల్యేలు పాశిం సునీల్‌కుమార్, కురుగుండ్ల రామకృష్ణ, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎంఎం కొండయ్యలు పాల్గొన్నారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్రసన్నారెడ్డి, చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్టు సెల్వం, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, తానంకి నానాజీ, మాజీ మంత్రి పరసారత్నం, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, టూరిజం ఆర్డీ రమణప్రసాద్, ఆర్డీవో కిరణ్మయి, జిల్లా పర్యాటక అధికారి జనార్థన్‌రెడ్డి పాల్గొన్నారు.

20 నిమిషాల్లోనే సభ పూర్తి

తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ చివరిరోజు సమావేశం కేవలం 20 నిమిషాలలోనే ముగిసిపోయింది. మంత్రులు, నాయకులు, అధికారులు ముఖ్య అతిథులంతా 7 గంటలకే వేదిక వద్దకువచ్చి వేదిక ముందు ఆశీనులయ్యారు. సుమారు గంటకుపైగా నిమిషాలపాటు సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. 8.10 గంటల సమయంలో అందరిని స్టేజీపైకి ఆహ్వానించగా 20 నిమిషాలలోనే అంటే 8.30 గంటలకు సమావేశంలో వక్తలు మాట్లాడటం పూర్తయిపోయింది. దేవదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి 7 గంటలకే వచ్చి వేదిక ముందు ఆశీనులయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించిన ఆయన 8 గంటల సమయంలో స్టేజీ పైకి రాకుండానే అలాగే వెళ్లిపోయారు.

జాతరలా.. ఫ్లెమింగో ఉత్సవాలు

- ఘనంగా ముగిసిన పక్షుల పండుగు


ముగింపు సభకు హాజరైన జనం

ఉత్సాహంగా క్రీడలు

నిజానికి తొలిరోజు కురిసిన వర్షంతో ఆదివారం సాయంత్రం వరకు క్రీడలు జరగలేదు. నిర్వాహకులు ఆగమేఘాలమీద మట్టి, ఇసుక తోలి చదును చేసి క్రీడాప్రాంగణాన్ని సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచే కబడీ, వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆడారు. రాత్రి 7 గంటల వరకూ క్రీడా పోటీలు జరిగాయి.

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తరువాత మూడురోజులపాటు జరిగిన ఫ్లెమెంగో ఫెస్టివల్ ఘనంగా ముగిసింది. తొలిరోజు ఏర్పాట్లలో తడబడినా మిగిలిన రెండు రోజులూ అన్ని విభాగాల అధికారులూ సమన్వయంతో సక్సెస్ చేశారు. ముఖ్యంగా సూళ్లూరుపేట ప్రభుత్వ కళాశాల మైదానంలో సాయంత్రాలు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు హుషారెత్తించాయి. సినీ నటులూ, గాయకులూ రావడంతో జనం పోటెత్తారు. మూడోరోజు సోమవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు వేలాదిగా పక్షుల పండుగకు తరలివచ్చారు. రంగురంగుల యూనిఫారాల్లో పిల్లలు సందడి చేశారు. నేలపట్టులో పక్షుల వీక్షణకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అటకానితిప్ప వద్ద కూడా ఆటలతో సందడిగా గడిపారు. బీవీపాలెం పడవల రేవు మూడో రోజు కూడా కిక్కిరిసిపోయింది. సూళ్లూరుపేట ప్రధాన వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద జనం బారులు తీరారు. ఈ ప్రాంతంలో జరిగే చెంగాళమ్మ జాతరను ఫ్లెమింగో ఫెస్టివల్ తలపించింది. మరోవైపు ఆటల్లోనూ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏనుగులను అడవుల్లోకి మళ్లించడానికి

ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు

- డ్రోన్ల ద్వారా కదలికలు గుర్తిస్తాం
- జిల్లా అటవీశాఖ అధికారి వివేక్




తిరుపతి(మంగళం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పంటలపై ఏనుగుల దాడిని నివారించడానికి, వాటిని అడవుల్లోకి మళ్లించడానికి ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశామని జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ తెలిపారు. తిరుపతిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎలిఫెంట్ ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలో పది మంది ఉంటారని, ఇలా మూడు టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఇవి సబ్ డివిజనల్ ఫారెస్టు అఫీసర్ పర్యవేక్షణలో పని చేస్తాయన్నారు. డ్రోన్ల సాయంతో ఏనుగుల గుంపు కదలికలను పరిశీలిస్తారన్నారు. ఎప్పటికప్పుడు వాటిని గుర్తించి పంచాయతీ, అగ్రికల్చర్ అసిస్టెంట్, విద్యుత్‌శాఖ, అటవీశాఖకు చెందిన అధికారులతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్‌లకు సమాచారం అందిస్తారన్నారు. వారు తమ పరిధిలోని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తారని వివరించారు. ఏనుగుల కట్టడికి గ్రామస్తుల సహకారం అవసరమన్నారు. కాగా, 9 నెలలుగా ఏనుగుల గుంపు చంద్రగిరి మండలం కందులవారిపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో తిరుగుతోందని, నెల క్రితమే వాటికి పిల్లలు కలిగాయని చెప్పారు. ట్రాకర్ల ద్వారా ఏనుగుల గుంపును అటవీ ప్రాంతంలో మళ్లించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అటవీ సరిహద్దు గ్రామాల పరిధిలో ప్రచార జాతాలు, టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటును పరిశీలిస్తున్నామన్నారు.

తిరుపతి ఎస్పీగా మళ్లీ హర్షవర్ధన రాజు



తిరుపతి(నేరవిభాగం), జనవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్పీగా మళ్లీ హర్షవర్ధన రాజును నియమిస్తూ డీజీపీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతేడాది మే 19న ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. దాదాపు రెండు నెలల పాటు పనిచేసిన ఈయన జిల్లాలో శాంతి భద్రతలను అదుపు చేయడంలో సఫలీకృతులయ్యారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగించే విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఎన్నికల కమిషన్ నుంచి ప్రశంసలు అందుకున్నారు. కౌంటింగ్ అనంతరం కూచువారిపల్లి, రామిరెడ్డిపల్లి, చంద్రగిరి, రామచంద్రాపురం తదితర ప్రాంతాల్లో మళ్లీ రాజకీయ ఘర్షణలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పోలీసు అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని సంక్షేమం, ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి పెద్దపీట వేశారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చారు. తిరుపతిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న తరుణంలో ప్రభుత్వం ఆయన్ను కడప ఎస్పీగా బదిలీ చేసింది. అక్కడ కొద్ది నెలల పాటు పనిచేసి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన పనితీరును గుర్తించిన ప్రభుత్వం మళ్లీ తిరుపతి జిల్లాకు ఎస్పీగా నియమించింది. ఈయన రెండు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, ప్రజలు, పోలీసులు, మీడియా సహకారంతో పోలీసు శాఖ పరంగా నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడానికి కృషి చేస్తానని చెప్పారు. గతంలో సిద్ధం చేసిన దాదాపు 10 ప్రతిపాదనలను దశల వారీగా అమలు చేస్తానన్నారు. తిరుపతిలో కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని స్మార్ట్ సిటీ నిధుల కింద సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తానని హర్షవర్ధనరాజు తెలిపారు.

'ఎర్రచందనం' టాస్క్‌ఫోర్స్‌కు సుబ్బరాయుడు



తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీగా సుబ్బరాయుడిని నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతేడాది జూలై 15న ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన సమర్థ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. అవినీతి, అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. ఈయన హయాంలో దాదాపు 10 మంది పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేయడం, వారికి మెమోలు జారీ చేశారు. శాంతి భద్రతల అదుపునకు, గంజాయిని అరికట్టేందుకు విశేష కృషి చేశారు. చోరీకి గురైన సెల్‌ఫోన్లను భారీ ఎత్తున రికవరీ చేయడంలో రాష్ట్రంలోనే తిరుపతిని నెంబర్ వన్ స్థానంలో నిలిపారు. పోలీసు, ప్రజల మధ్య సమన్వయం కోసం కృషి చేశారు. ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జిగా.. స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. అయితే, ఇటీవల టీటీడీ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి టికెట్లు జారీ చేసే ప్రక్రియలో జరిగిన తొక్కిసలాట, తోపులాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడం, మరో 40 మంది గాయపడడంతో సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం సీవీఎస్వోతో పాటు అప్పటి ఎస్పీ సుబ్బరాయుడినీ జనవరి 11న బదిలీ చేసింది. 10 రోజులుగా ఎక్కడా పోస్టింగ్ లేకుండా ఉన్న సుబ్బరాయుడిని తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీగా నియమించింది

శ్రీవారి అన్నప్రసాదంలో మసాలా వడ



తిరుమల, జనవరి20(ఆంధ్రజ్యోతి): శ్రీవారి అన్నప్రసాదాల మెనూలో టీటీడీ మసాలా వడను చేర్చింది. భక్తులకు కొన్నేళ్లుగా అన్నంతో పాటు కర్రీ, కొబ్బరి చట్నీ, చక్కెర పొంగలి, సాంబారు, రసం, మజ్జిగ వడ్డిస్తున్నారు. అన్నదానం మెనూలో మరో పదార్థం చేర్చాలని గతేడాది నవంబరు 18న టీటీడీ ధర్మకర్తల మండలి తీర్మానించింది. ఈక్రమంలో సోమవారం మధ్యాహ్నం ప్రయోగాత్మకంగా ఉల్లి,వెల్లుల్లి లేకుండా దాదాపు 5 వేల వడలను తయారు చేసి భక్తులకు వడ్డించారు. దీనిపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేయడంతో మరో నాలుగు రోజుల పాటు వడల తయారీని పెంచి వడ్డించనున్నారు. రథసప్తమి నాటికి రెండుపూటలా అందించేలా టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. మసాలా వడ మాత్రమే కాకుండా ఆ స్థానంలో మరేదైనా పెట్టవచ్చా అనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

రేపటి నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షలు

మూడు కేంద్రాల్లో హాజరుకానున్న 1,242మంది అభ్యర్థులు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 20(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్ష బుధవారం నుంచి నిర్వహించనున్నారు. 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. 22, 23, 24, 28, 29 తేదీలలో మొదటి షిఫ్ట్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ షిఫ్ట్ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని వివరించారు. 30న రెండవ షిఫ్ట్ 3 నుంచి సాయంత్రం 6.30 గంటలకు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 8.45, మధ్యాహ్నం 2.45 గంటలలోపు కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్దకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. కేంద్రాల్లో వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు.

పరీక్షా కేంద్రాలివే.. : అయాన్ డిజిటల్ జూపార్కు, చెర్లోపల్లి, తిరుపతి అయాన్ డిజిటల్ జూపార్కు, కేఎంఎం రామిరెడ్డిపల్లి, చంద్రగిరి ఎన్‌టీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల, విద్యానగర్, కోట మండలం.

సస్యరక్షణతో నాణ్యమైన దిగుబడులు సాధ్యం



మామిడితోటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి శైలజ

పాకాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో సరైన సస్యరక్షణ పాటించి నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని ఉద్యాన అధికారి శైలజ సూచించారు. బందార్లపల్లె సమీపంలో మామిడి తోటలను సోమవారం వ్యవసాయవిస్తరణ అధికారి రమేష్ నాయక్‌తో కలిసి ఆమె పరిశీలించారు. వర్షాల కారణంగా మామిడి పూత ఒకేసారి రావడం లేదని, వచ్చిన పూత తెగులు ఆశించి మగ్గిపోయి రాలిపోతుండడం గమనించారు. నిద్రావస్థలో వున్న మొగ్గ పూత బయటకు రావడానికి రైతులు: 13: 0:45: (మల్టీకె) 10 గ్రాములు ఫార్ములా4-2గ్రాములు, క్లోరోఫైరిపాస్ 50శాతం, ఈసీ-2మిల్లీ లీటర్లు, పిచికారి చేయాలన్నారు. మొగ్గవచ్చిన తరువాత పచ్చిపూతదశలో వున్నపుడు రెండవ పిచికారి బుప్రోపెజిన్, ఇస్పేట్ కాంబినేషన్‌లో వుండే పురుగు మందు ఒక గ్రాము, మాంకోజెబ్ కార్బెండిజమ్ కాంబినేషన్‌లో తెగులు మందు 1.5గ్రాములు, ఫార్ములా4 రెండు గ్రాములు, గమ్ 0.5 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి చొప్పున పిచికారి చేయాలన్నారు.

పేరూరు చెరువుకు జలకళ



తిరుపతి రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో పేరూరు చెరువుకు నిండుగా నీరుచేరింది. దీంతో చెరువు జలకళని సంతరించుకుంది. తొండవాడ వద్ద స్వర్ణముఖినది నుంచి సి.మల్లవరంమీదుగా ఈ చెరువుకు నీరు వచ్చే సప్లైఛానల్స్‌కి పలుచోట్ల అడ్డుగా మొక్కలుండేవి. ఎమ్మెల్యే పులివర్తినాని చొరవతో స్థానిక టీడీపీనేతలు ఎక్సవేటర్‌సాయంతో తొలగింపు పనులు చేపట్టారు. చెర్లోపల్లె సర్కిల్ నుంచి వకుళామాత ఆలయం వరకు పూతలపట్టు-నాయుడుపేట జాతీయరహదారి వైపు ఈ చెరువు ఆకర్షిస్తోంది.

ఈనెలాఖరు వరకూ పశువైద్య శిబిరాలు

భాకరాపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో జరుగుతున్న పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని భాకరాపేట పశువైద్యాధికారి స్రవంతి కోరారు. ఈనెల 21న టి.కుమ్మరపల్లె, తవ్వావాండ్లపల్లె, 22న పాలమాకులపల్లె, చెరువుముందరపల్లె, 23న మట్టివారిపల్లె, రాజువారిపల్లె, 24న శాంతినగర్, రంగన్నగారిగడ్డ, 25న దేవరకొండ, బద్దలవారిపల్లె, 26న భాకరాపేట, చిన్నగొట్టిగల్లు, 27న జంగావాండ్లపల్లె, 29న పొట్టిగాని తోపు, బోడిరెడ్డిగారిపల్లె, 30న తుమ్మచేనుపల్ల, తిప్పిరెడ్డిగారిపల్లె, 31న కుమ్మరపల్లె, ఎడంవారిపల్లె గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ఆమె వివరించారు.

బాధిత రైతులకు త్వరగా పరిహారం చెల్లించాలి.



ఎఫ్ఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న మురళి,రైతులు

భాకరాపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు త్వరగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని మండల టీడీపీ బెల్లంకొండ మురళీ కోరారు. ఫారెస్టు రేంజ్ అధికారి వెంకటరమణకు సోమవారం ఆయన ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో ఎగవూరు, దిగవూరు, నెల్లుట్లవారిపల్లె, భాకరాపేట, చిట్టేచర్ల గ్రామాల్లో ఏనుగులు పంటలను ధ్వంసం చేశాయన్నారు బాధిత రైతులకు ఇంత వరకు పరిహారం అందలేన్నారు. సుబ్రహ్మణ్యం, నాగచంగమనాయుడు, రెడ్డప్ప రెడ్డి, వెంకటరత్నం, రెడ్డిసుబ్రహ్మణ్యం, నాగిరెడ్డి, చంద్రశేఖర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్‌పై కౌన్సెలింగ్ తరగతులు



మార్గదర్శిని పుస్తకాలు అందజేస్తున్న వెంకట సుబ్రమణ్యం

ఎర్రావారిపాలెం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో 9,10 తరగతులు, ఇంటర్ విద్యార్థులకు విజయ సోపాన యాత్ర పేరుతో కెరీర్ కౌన్సెలింగ్ తరగతుల కార్యక్రమం కేజీబీవీ మోడల్ కాలేజీలో సోమవారం నిర్వహించారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పైడి అంకయ్య మాట్లాడుతూ 10వ తరగతి, ఇంటర్ తరువాత ఉజ్వల భవితకు ఎలాంటి కోర్సులు చదవాలో సూచించారు. ఎంఈవో వెంకట సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇంటర్‌లోనే తమకు పట్టువున్న సబ్జెక్టులను ఎంపిక చేసుకోవాలన్నారు. విద్యార్థులకు మార్గదర్శిని పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుపతి జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ట్రైనర్ రాజు,భాషా ప్రిన్సిపాల్ పరిమల, శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉల్లాస్‌తో వయోజనుల్లో అక్షర వెలుగులు నింపాలి



బుక్ మెటీరియల్‌ను చూపిస్తున్న వయోజనులతో ఎంపీడీవో ఇందిరమ్మ

రామచంద్రాపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వయోజనులైన నిరక్షరాస్యులను ఉల్లాస్ కార్యక్రమం కింద అక్షరాస్యులను చేయాలని ఎంపీడీవో ఇందిరమ్మ అన్నారు. ఆర్‌సీపురంలోని వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘం సహాయకులు, వలంటీర్లు, టీచర్లకు ఉల్లాస్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉల్లాస్ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గురుమూర్తి, సీసీలు సుధాకర్, పార్వతమ్మ, అరుణ, ఎంఎస్ లీడర్లు, వీఏవోలు పాల్గొన్నారు.

సి.గొల్లపల్లెలో రీసర్వే ప్రారంభం



సర్వే సిబ్బందికి సూచనలిస్తున్న రామమోహన్

తిరుపతిరూరల్, జనవరి20(ఆంధ్రజ్యోతి): సి.గొల్లపల్లె పంచాయతీలో సోమవారం పైలట్ ప్రాజెక్ట్ కింద రోవర్‌తో రీసర్వేను ప్రారంభించారు. గ్రామ హద్దులను నిర్ధారించే పనులను చేపట్టారు. 15రోజుల పాటు హద్దులను నిర్ణయించనున్నారు. తర్వాత గ్రామసభలు నిర్వహించి రైతులసమక్షంలో ఫీల్డ్ సర్వే చేస్తామని ఆర్ఎస్‌డీటీ మోహన్ పేర్కొన్నారు. ఆర్డీవో రామమోహన్ రీసర్వేని తనిఖీ ప్రక్రియను చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా సర్వే చేపట్టాలన్నారు. పలు సూచనలు చేశారు. సర్వేస్ ఇన్‌స్పెక్టర్ కృపాకర్, మండలసర్వేయర్ హేమకుమార్, వీఆర్వో మురళి, గ్రామసర్వేయర్ భరణి తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్లలోపు పిల్లలకు నేటినుంచి ఆధార్ నమోదు

తిరుపతిరూరల్, జనవరి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామసచివాలయాల పరిధిలో 0-6 ఏళ్లలోపు పిల్లలకు మంగళవారం నుంచి గురువారం వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. అవిలాల, తిరుచానూరు, వెంకటపతినగర్, మంగళం-2 గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అవిలాల కేంద్రంలో ఆంధ్రాబ్యాంక్‌కాలనీ, అవిలాల, ధనలక్ష్మినగర్, సాయినగర్-1,2, లింగేశ్వరనగర్ శ్రీనివాసపురం, పద్మావతిపురం, చిగురువాడ, దుర్గసముద్రం, మల్లంగుంట, తిరుచానూరు సెక్రటేరియట్‌లో తిరుచానూరు, యోగిమల్లవరం, చైతన్యపురం, లక్ష్మినగర్‌కాలనీ, దామినేడు, పాడిపేట, బ్రాహ్మణపట్టు, తనపల్లె, ఓటేరు, వేదాంతపురం, వెంకటపతినగర్‌లో చెర్లోపల్లె, వెంకటపతినగర్, పుదిపట్ల, పేరూరు, హరిపురంకాలనీ, విద్యానగర్, తుమ్మలగుంట, గొల్లపల్లె, సి.మల్లవరం, పెరుమాళ్లపల్లె, ఎస్వీనగర్, మంగళం కేంద్రంలో శెట్టిపల్లె, బీటీఆర్‌కాలనీ, మంగళం-1,2, తుడాక్వార్టర్స్ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు





జస్టిస్ వేలుమణి-దినేష్‌శర్మ

తిరుమల, జనవరి20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కర్ణాటక మంత్రి రామలింగారెడ్డి, రాజ్యసభ ఎంపీ దినేష్ శర్మ ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

చంద్రగిరి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రైలుపట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. వారి కథనం మేరకు శ్రీవారిమెట్టు మార్గంలో రైలు పట్టాలపై ఆదివారం రాత్రి సుమారు 20 నుంచి 25 సంవత్సరాల వయసున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తలభాగం తెగి మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉంది. మృతుడు గుండుతో ఉన్నాడని, ఆధారాలు లభించలేదని రైల్వే ఎస్ఐ ప్రవీణ్ కుమార్ చెప్పారు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సమాచారం తెలిస్తే 9494228854, 9440416642 నంబర్లకు తెలియజేయాలని ఆయన కోరారు.

సింగిల్‌విండో మాజీ చైర్మన్ బాబ్జినాయుడు మృతి



చంద్రగిరి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఐతేపల్లె సింగిల్ విండో మాజీ చైర్మన్ మేడసాని బాబ్జి నాయుడు(60) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. అనంతగుర్రప్పగారిపల్లెకు చెందిన ఆయన 1989 నుంచి 1994 వరకు సింగిల్ విండో చైర్మన్‌గా సేవలందించారు. మాజీ మంత్రి గల్లా అరుణకుమారి మంత్రిగా ఉన్న సమయంలో ఆమె అనుచరుడిగా ఉన్నారు. వివాద రహితుడుగా పార్టీలకు అతీతంగా సేవలందించారు. ఈయన మృతికి పలువురు టీడీపీ, వైసీపీ, బీజేపీ నాయకులు సంతాపం తెలియజేశారు.

ఏజీ-బీఎస్సీ మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి మార్గదర్శకాలు

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లు భర్తీలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం జారీ చేసింది. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల తరహాలో మేనేజ్‌మెంట్ కోటా(కేటగిరి బీ) సీట్లును భర్తీ చేయాలని స్పష్టత ఇచ్చింది. అగ్రికల్చర్ బీఎస్సీ(హానర్స్)లో కేటగిరి బీ కింద మిగిలిపోయిన సీట్లను మొదట ఈఏపీ సెట్‌లో అర్హత సాధించిన వారితో నింపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇంటర్మీడియట్ బైపీసీలో 45%పైగా మార్కులు వచ్చిన ఓసీలకు, బీసీ,ఎస్సీ,ఎస్టీలకు 40%పైన మార్కులు వచ్చిన వారికి అవకాశం కల్పించాలని, ఇంకా ఖాళీలు ఉంటే మార్కుల శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.

బావిలో దూకి వివాహిత ఆత్మహత్య

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని వట్రపాలెం ప్రాంతానికి చెందిన నెమలదిన్నె అన్నపూర్ణ (29) బావిలో దూకి ఆత్మహత్య చేసుంది. ఆదివారం కూలి పనికి వెళ్లిన అన్నపూర్ణ రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. . సోమవారం ఉదయం అన్నపూర్ణ మృతదేహాన్ని బావిలో తేలియాడుతుండడాన్ని గుర్తించి స్థానికుల సహకారంతో వెలికితీశారు.

పల్లె నుంచి ఢిల్లీ దాకా...



శ్రీకర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్

శ్రీకాళహస్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మా రుమూల పల్లెలో పుట్టి ఢిల్లీలో జరిగిన కార్య క్రమంలో పాల్గొన డంపై విద్యార్థి శ్రీకర్‌ను ఎమ్మెల్యే సుధీర్ అభినందించారు. మండలలోని ఊరం దూరు జడ్పీ ఉన్నత పాఠ శాల 9వ తరగతి విద్యార్థి శ్రీకర్ ఇటీవల ఢిల్లీలో జరి గిన ప్రధానమంత్రి పరీక్షా పే చర్చా కార్య క్రమంలో పాల్గొన్నాడు. దీన్ని పురస్కరించుకుని సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని ఎమ్మెల్యే అభినందించారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజకు మారి, గైడ్ టీచర్, గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన డ్రైనేజీ వ్యవస్థతో అవస్థలు



లింగేశ్వరనగర్ వద్ద మజ్జిగకాలువలో ముందుకు కదలని మురుగు



ఓటేరుకాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

తిరుపతి రూరల్, జనవరి20(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో డ్రైనేజీ పరిస్థితులు ఇబ్బందికరంగా తయారయ్యాయి. కాలువల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. మచ్చుకు కొన్నిపరిశీలిస్తే.. ఎంఆర్‌పల్లె పోలీసు స్టేషన్ సమీపం నుంచి ప్రారంభమయ్యే మజ్జిగ కాలువ(డ్రైనేజీ) లింగేశ్వరనగర్, సాయినగర్‌ల మీదుగా పద్మావతిపురం వరకు వెళుతుంది. ఈకాలువకు పలుచోట్ల అడ్డంగా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. కాలువకు కవరింగ్ స్లాబ్ లేకపోవడం వల్ల దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. అవిలాల శాసప్పకాలనీ, గాంధీపురం ధనలక్ష్మినగర్‌ల యూడీఎస్‌ను ఈకాలువకు లింక్‌చేసి వదులుతున్నారు. దీంతో మురుగుతోపాటు యూడీఎస్ ద్వారా వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామంటున్నారు.

● శ్రీనివాసపురం నుంచి ఓటేరువరకు కిలోమీటరుకి పైగా కాలువ ఉంది. కాలువనిండాచెత్త, వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయి. కాలువ సమీపంలో ముళ్లపొదల్లో నిత్యం పందులు సంచరిస్తుంటాయి. అటు వెళ్లే స్థానికులు, వాహనచోదకులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి. సమీపంలోనే రజకుల, గంగిరెద్దులకాలనీలు ఉన్నాయి. వీరంతా ఈ దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ప్రారంభం



మొరవపల్లెలో పశువైద్య శిబిరం ప్రారంభిస్తున్న జడ్పీటీసీ పద్మజరెడ్డి

పాకాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మొరవపల్లె, అచ్చమ్మ అగ్రహారం గ్రామాల్లో సోమవారం పశువైద్యశిబిరాలు నిర్వహించారు. శిబిరాలను జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. 40 పశువులకు, రెండు మేకలకు, 135 కోళ్లకు, 42 దూడలను పరీక్షించి మందులు అందజేశారు. శిబిరాల్లో ఏడీఏహెచ్ డాక్టర్ శ్రీధర్, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, సర్పంచ్ చెంగల్రాయులు, ఎంపీటీసీ రాజ్యలక్ష్మీ, టీడీపీ నాయకులు కె.సావిత్రి, చలపతినాయుడు, పశువైద్యాధికారి జానకమ్మ, డాక్టర్ మోహన కుమారి పాల్గొన్నారు. **భాకరాపేట:** చిట్టేచర్ల, కోటబైలు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను ఏడీఏ రమణ కుమార్ ప్రారంభించారు. పశువులకు గర్భనిర్ధారణ పరీక్షలు, నట్టల నివారణ మందులు స్ప్రే చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, క్లస్టర్ ఇన్‌ఛార్జి శివకుమార్, పశువైద్యాధికారి స్రవంతి, సర్పంచ్ నాగచంగమనాయుడు, తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రాపురం:** అనుపల్లి పంచాయతీ బొప్పరాజుపల్లిలో పశు వైద్య శిబిరాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమల రెడ్డి ప్రారంభించారు. పశువులకు వైద్య సేవలందించారు. డాక్టర్ జయకిషోర్, కిరణ్‌కుమార్, ఏపీవో హంసవేణి, టీడీపీ నాయకులు జనార్దనచౌదరి,వెంకటేష్‌నాయుడు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరిహారం అందజేత



క్షతగాత్రులకు చెక్‌లు అందజేస్తున్న పనబాక లక్ష్మి, నర్సిరెడ్డి

తిరుమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంలో తొలిరోజు జరిగిన తొక్కిసలాటలో గాయపడిన ముగ్గురికి టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, నర్సిరెడ్డి సోమవారం రూ.6 లక్షల పరిహారం చెక్‌ను అందజేశారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని నిజాంపేట, జిల్లెలగూడకు చెందిన బుచ్చమ్మ, సావిత్ర, సాంబశివారెడ్డిలకు రూ.2 లక్షల చొప్పున చెక్‌లను సోమవారం వీరు అందజేశారు.

స్మార్ట్ సిటీ పెండింగ్ పనులు పూర్తి చేయండి



కొర్లగుంట బైపాస్ రోడ్డు వద్ద మురుగు కాలువను పరిశీలిస్తున్న మౌర్య, చంద్రశేఖర్

తిరుపతి, జనవరి20(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్‌సిటీ నిధులతో తిరుపతి నగరంలో చేస్తున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సిటీ ఆపరేషన్ సెంటర్(నగరపాలక సంస్థ కార్యాలయం), మల్టీ లెవల్ కార్ పార్కింగ్, గరడ వారధికి సంబంధించి పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్, స్మార్ట్ సిటీ అధికారులతో కలసి ఆయా ప్రాంతాల్లో సోమవారం కమిషనర్ పరిశీలించారు. గడువులోపు నాణ్యతతో పనులు పూర్తి చేయాలన్నారు. కొర్లగుంట వద్ద మురుగునీటి కాలువ నిర్మాణంపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఈ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ ఈఈ చంద్రశేఖర్, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, డీఈలు రాజు, మధు, రమణ, లలిత, వెంకట ప్రసాద్, ఏసీపీ. బాలాజీ, ఎయికాం ప్రతినిధి బాలాజీ, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఆమె వెంట ఉన్నారు.

జంప్‌రోప్ పోటీల్లో అఖండ విజయం



జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), జనవరి 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జంప్‌రోప్ పోటీల్లో మంగళం బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. నేపాల్ పోఖారా స్టేడియం వేదికగా ఇటీవల ఇండో-నేపాల్ జట్ల మధ్య జంప్‌రోప్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రాతినిథ్యం వహించిన బీసీఎం హైస్కూల్ విద్యార్థులు లాస్య(అండర్ 19 విభాగంలో), వి.వేదశ్రీ, ఎం.దినేష్, టి.ఆర్.మోనీష్, ఆర్.హరిప్రియ(అండర్ 14విభాగంలో) రాణించి, బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు కృష్ణమూర్తినాయుడు విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కరస్పాండెంట్ ప్రియా, ప్రిన్సిపాల్ సుకన్య పాల్గొన్నారు.

టీటీడీలో ధర్మానికి ప్రాధాన్యత ఇవ్వాలి



కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన తెలుపుతున్న చింతా మోహన్

తిరుపతి(వైద్యం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో డబ్బుకు కాకుండా ధర్మానికి ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ కోరారు. భక్తుల సేవకు పెద్దపీట వేయాలన్నారు. టీటీడీ పరిపాలనా భవనం ఎదుట ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అతిపెద్ద ధార్మిక సంస్థ అయిన టీటీడీలో చిన్నచిన్న పొరపాట్లు జరుగుతుంటాయని, వాటిని భూతద్దంలో చూడాల్సిన అవసరం లేదని అన్నారు. అధికారులతో పాటు ఉద్యోగులందరూ బాగా పనిచేస్తున్నారని కితాబునిచ్చారు. అర్చకుల, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. వారితోపాటు వర్కింగ్ జర్నలిస్టులకు 5 సెంట్ల ఇంటి స్థలాన్ని అందించాలన్నారు. స్విమ్స్‌లో, రుయాలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. టీటీడీ ఉద్యోగులకు పుత్తూరు దగ్గర ఇచ్చిన ఇంటి స్థలాలను రద్దు చేసి, నగదు వెనక్కు ఇచ్చేయాలని కోరారు. కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపిగౌడ్, రవి, తేజోవతి, మునిశోభ, వెంకటేష్ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి మృతి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పాండ్రవేటి రవికుమార్(61) సోమవారం మృతి చెందారు. ఆయన తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సన్నిహితుడు. వీరిద్దరూ కలిసి ఆర్టీసీ బస్టాండు ఎదురుగా గతంలో సిద్ధార్థ ట్రావెల్స్ నడిపారు. రవికుమార్ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారని ఆయన బంధువులు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి



మృతిచెందిన చంద్రశేఖర్

తిరుపతి(నేరవిభాగం), జనవరి 20(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం రైలు ఎక్కుతూ కింద పడి గాయాలతో రుయాలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ విఠల్ నాయక్ తెలిపారు. చెన్నైకు చెందిన చంద్రశేఖర్ ఈ నెల 17న తిరుపతి రైల్వేస్టేషన్‌లో చెన్నై సెంట్రల్ వెళ్లే రైలు ఎక్కుతూ జారి కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆచూకీ తెలిసిన వారు 8328029723కు సమాచారం అందివ్వాలని కోరారు.

ట్యాక్సీ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్) జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ట్యాక్సీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, వారి సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖరరెడ్డి, కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ట్యాక్సీ కార్మికుల సంఘం ప్రథమ జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే జిల్లా మహాసభల్లో ట్యాక్సీ కార్మికుల సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాజా, రవి, మణి, రమేష్, ఎల్‌కే నాయుడు పాల్గొన్నారు.

సంక్రాంతి ప్రత్యేక బస్సుల రాబడి రూ.66.6లక్షలు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని ఆర్టీసీ జిల్లా యంత్రాంగం నడిపిన ప్రత్యేక బస్సుల ద్వారా రూ. 66.6లక్షలు సమకూరింది. ఈనెల 10, 11, 12, 15, 16, 19 తేదీల్లో హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, కడప, మదనపల్లె, అనంతపురానికి ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపారు. తిరుపతి కేంద్రంగా ఆయా ప్రాంతాలకు 1.20లక్షల కిలోమీటర్లు తిరగగా, అక్యుపెన్సీ రేషియో 80నమోదు కాగా, ఈపీకే రూ.46.38నమకూరింది. ప్రత్యేక బస్సులను నడపడంలో సమన్వయంతో వ్యవహరించిన సీటీఎం విశ్వనాథం, ఏటీఎం రామచంద్రనాయుడు, బ్రహ్మయ్యలను డీపీటీవో నరసింహులు అభినందించారు.

మృత్యుంజయస్వామికి పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషే కించారు. అనంతరం గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలం కరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

చినుకుపడితే ఈ దారిలో ఇబ్బందే..



: వినాయకనగర్‌లో చిన్నపాటివర్షానికి గుంతల్లో నీరు

తిరుపతిరూరల్, జనవరి20(ఆంధ్రజ్యోతి): అవిలాల పరిధిలోని వినాయకనగర్‌లో ఇప్పటికీ సరైన రోడ్డు సౌకర్యంలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. తిరుపతి నగరానికి ఆనుకుని ఉన్నా మట్టిరోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. దారిపొడవునా గుంతలు ఏర్పడడంతో చిన్నపాటి వర్షం వచ్చినా గుంతలో నీరుచేరి ఇబ్బందిపడుతున్నారు. స్టోన్‌డస్ట్‌తో పూడ్చిన గుంతలు కొన్నిరోజులకే తిరిగి మామూలుగా దర్శనమిస్తున్నాయి.

యువతలో నైపుణ్యాభివృద్ధికి పీఎం ఇంటర్న్‌షిప్


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఐదేళ్లలో 500 కంపెనీల్లో కోటిమంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పీఎం ఇంటర్న్‌షిప్ పథకం ప్రారంభమైందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు 12 నెలలపాటు పారిశ్రామిక అనుభవం కోసం ఈ పథకం ప్రారంభించినట్లు చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అభ్యర్థులు 9988853335ను సంప్రదించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని

రూ.1.42 లక్షలు తీసుకున్నాడు

- పీజీఆర్ఎస్‌లో బాధితురాలి ఆవేదన


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.1.42 లక్షలు తీసుకుని మోసం చేశాడని తిరుపతి రూరల్ పుదిపట్లకు చెందిన గౌతమి సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌లో ఫిర్యాదు చేసింది. స్పందించిన క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు వెంటనే చర్యలు తీసుకోవాలని రూరల్ సీఐ చిన్నగోవిందును ఆదేశించారు. బెంగళూరులోని టీసీఎస్‌లో పనిచేస్తున్న గౌతమి ఇంకా మంచి ఉద్యోగం కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ క్రమంలో ఎచెంచర్ కంపెనీలో పనిచేస్తున్న హేమశేఖరరెడ్డితో పరిచయమైంది. ఆ కంపెనీలో ఉద్యోగం తీసివ్వాలని కోరింది. ఇదే అవకాశంగా భావించిన హేమశేఖర్‌రెడ్డి మాయమాటలు చెప్పి నాలుగు దఫాలుగా ఆమె నుంచి రూ.1.42 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం గురించి అడిగితే తప్పించుకుని తిరగడం ప్రారంభించాడు. రెండు రోజులుగా అతని ఫోన్ పనిచేయకపోవడంతో ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. అలాగే భూముల విషయమై వడమాలపేట నుంచి వినతులు వచ్చాయి. మొత్తం పీజీఆర్ఎస్‌కు 53 వినతులు అందాయి. అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, సీఐ శ్రీరాములు పాల్గొన్నారు.

కుంభమేళాలో టీటీడీ గంగా హారతి


గంగా హారతి సమర్పిస్తున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి (ఉపాధ్యాయనగర్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కుంభ మేళాలో గంగానదికి సోమవారం టీటీడీ హారతి సమర్పించింది. టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి దేవస్థానం అధికార ప్రతినిధిగా ప్రయాగరాజ్‌లోని కుంభమేళాలో పాల్గొన్నారు. ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులతో కలిసి కుటుంబసమేతంగా భానుప్రకాష్‌రెడ్డి హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మబ్బు దేవనారాయణరెడ్డి

తిరుపతి అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మెకానిక్ వృత్తిలోని కార్మికుల సమస్యలపై పోరాడతామని శ్రీబాలాజీ టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ అన్నారు. యూత్ హాస్టల్లో సోమవారం నెలవారీ సమావేశం నిర్వహించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. పుంగనూరు, రైల్వేకోడూరు, శ్రీకాళహస్తికి చెందిన మెకానిక్స్‌కు సభ్యత్వం కల్పించి, సంఘానికి పరిచయం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ నేత మబ్బుదేవనారాయణరెడ్డి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎన్.ఆర్.బాషా, కృష్ణారెడ్డి, హరిప్రసాద్, చందు, రఫీ, వి.ఆనంద్ పాల్గొన్నారు.

ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థపై జాగ్రత్తగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న కుప్పాల సత్యనారాయణ

తిరుపతి(సెంట్రల్), జనవరి20(ఆంధ్రజ్యోతి): తిరుపతి లాంటి ప్రధాన రైల్వేస్టేషన్‌లో అందుబాటులోకి వచ్చిన ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థపై సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ అన్నారు. సోమవారం స్టేషన్‌లోని వీఐపీ చాంబర్‌లో భద్రతా ప్రమాణాలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను వాడుకుని రైలు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. రైలు మార్గాలను అనుసంధానం చేసే సమయంలో స్టేషన్ మాస్టర్లు, పాయింట్స్ మెన్లు భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. సమావేశంలో స్టేషన్ మేనేజరు డాక్టర్ చిన్నప్పరెడ్డి, గార్డులు, డ్రైవర్లు, స్టేషన్‌మాస్టర్లు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్లతో ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలు


వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న చంద్రశేఖరన్, రవిప్రభు

తిరుపతి(వైద్యం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య, ఆర్థిక ప్రయోజనాలకు వెల్‌నెస్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు అన్నారు. రుయాస్పత్రిలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్‌ను వారు సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య భద్రత విషయంలో సరైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఈ వెల్‌నెస్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో శ్రీనివాస్, ఏఆర్ఎంవో హరికృష్ణ పాల్గొన్నారు.

24 నుంచి విశాఖలో ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రాఘవేంద్ర

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24వ తేదీ నుంచి విశాఖపట్నంలో ఏబీవీపీ రాష్ట్ర 43వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పూజారి రాఘవేంద్ర ఆవిష్కరించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పీజీఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

- వివిధ సమస్యలపై 185 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 185 అర్జీలు అందగా అందులో భూ సమస్యలపై 122 ఉన్నాయి.

రెండేళ్లుగా పింఛను కోసం తిరుగుతున్నా..



నా భర్త రెండేళ్ల క్రితం మరణించాడు. నా వయసు 62 ఏళ్లు. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. వితంతు పింఛను కోసం రెండేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నా. ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇప్పుడైనా కనికరించి మంజూరు చేయండి.

- కే పద్మ, వెత్తలతడుకు, నారాయణవనం మండలం

బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు



నేను వికలాంగుడిని. ఏ పనీ చేయలేను. పింఛను మీద కుటుంబ పోషణ జరుగుతోంది. నాకు ముగ్గురు ఆడబిడ్డలు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం స్థలం ఇచ్చింది. నిర్మాణ పనులు చేపట్టిన తర్వాత బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. మీరైనా మంజూరు చేయించండి.

- నరసింహారావు, పద్మానగర్, రేణిగుంట

పింఛను ఇప్పించండి మహాప్రభో..



రెండేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. నడవలేని పరిస్థితుల్లో ఉన్నాను. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. వికలాంగ పింఛను మంజూరు చేసి కుటుంబాన్ని ఆదుకోండి.

- సుబ్రహ్మణ్యం, ఎంఎంవాడ, శ్రీకాళహస్తి

పీజీఆర్ఎస్ రోజు టౌన్ బస్సులు నడపాలి

ప్రతి సోమవారమూ కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌కు టౌన్ బస్సులు నడపాలి. జిల్లా నలుమూలల నుంచి వినతులు సమర్పించేందుకు ప్రజలు బస్టాండుకు చేరుకుని అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు రావడానికి రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ టౌన్ సర్వీసులు నడిచేవిధంగా చర్యలు తీసుకోవాలి. ఆటోల్లో రావాలంటే రూ.100కు పైగా అడుగుతున్నారు.



- రాజేంద్ర, తిరుపతి

గిరిజన భవన్‌ను అభివృద్ధి చేయండి

తిరుపతి నగరంలో గిరిజనులకు ఉపయోగంగా ఉండే గిరిజన భవన్ అభివృద్ధికి నోచుకోలేదు. అభివృద్ధి చేయడమేగాక మౌలిక వసతులు కల్పించాలి.

- శివశంకర్‌నాయక్,గిరిజన నవసమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు

మెడికల్ కాంట్రాక్టు వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

మెడికల్ కాంట్రాక్టు వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖరరెడ్డి, కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డుల వేతనాలు పెంచాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ కూడా సక్రమంగా అమలు చేయడంలేదని తెలిపారు. దీనిపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ రవి, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పుట్ల మహేంద్ర, ఏఐటీయూసీ నాయకులు వైఎస్ మణి, చంద్రబాబు, శ్రీనివాసులు, అల్లాబక్ష్, నరసింహులు, పురుషోత్తం, సుధాకర్, కవిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

కొత్తమారికుప్పం భూముల ఆక్రమణపై విచారణ చేపట్టాలి

సత్యవేడు మండలం కొత్తమారికుప్పం భూముల ఆక్రమణపై విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్తులతో కలిసి కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. మురళి మాట్లాడుతూ కొత్తమారికుప్పం రెవెన్యూలోని సుమారు 350 ఎకరాలకు పట్టాలు, హక్కు పత్రాలు లేకపోయినా ఆక్రమణదారుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారన్నారు. ఈ పట్టాదార్ పాసుపుస్తకాలను సృష్టించుకుని పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు పంచాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, సీపీఐ నాయకులు చిన్నిరాజ్, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాశయ్య, నాగభూషణం, నాగరాజు, రైతు, గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న మురళి - చంద్రశేఖర్‌రెడ్డి

ఆరోగ్య కార్యాలయం ముందు అనారోగ్యం


డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలోని దుకాణం ముందు అధ్వానంగా ఉన్న పారిశుధ్యం - దుకాణంలోని ఆహార పదార్థాల ముందు పారుతున్న మురుగు నీరు - కార్యాలయం మీదుగా ప్రవహిస్తున్న మురుగునీరు

తిరుపతి(వైద్యం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించే జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం ముందే పారిశుధ్యం అధ్వానంగా ఉంది. కార్యాలయాన్ని అనుకుని చిన్నపాటి ఆహార దుకాణం ఉంది. దీనిముందు నిత్యం మురుగు నీరు ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. దుకాణం నుంచి వచ్చే మురుగునీరు డీఎంహెచ్‌వో కార్యాలయం మీదుగా రోడ్లపైకి చేరుతోంది. దుకాణంలో విక్రయించే ఆహార పదార్థాలపైనా దోమలు, ఇతర కీటకాలు చేరి కలుషితమవుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీఎం భరోసా చెక్కు అందజేత


కలెక్టర్ నుంచి చెక్కు అందుకుంటున్న చెంచయ్యనాయుడు కుటుంబం

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 20(ఆంధ్రజ్యోతి): మంగళంకు చెందిన చెంచయ్యనాయుడు కుటుంబానికి సోమవారం సీఎం భరోసా కింద రూ.2లక్షల చెక్కును అందజేశారు. రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిందని, జీవనం కష్టమవుతోందని ఇటీవల నారావారిపల్లికి వచ్చిన సీఎం చంద్రబాబుకు చెంచయ్యనాయుడు వివరించారు. ఈ మేరకు సీఎం భరోసా పథకం కింద మంజూరైన చెక్కును కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆస్తులిచ్చినవారికి టీడీఆర్ బాండ్లు ఇవ్వండి


టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని కోరుతున్న టౌన్‌క్లబ్ ప్రతినిధులు

తిరుపతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ రోడ్లకోసం విలువైన ఆస్తులు ఇచ్చిన వారికి టీడీఆర్ బాండ్లు త్వరితగతిన అందేలా చూడాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కోరారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఫ్రీలెఫ్ట్ కోసం టౌన్‌క్లబ్‌కు చెందిన స్థలాన్ని ఇచ్చామని, ఇంతవరకు టీడీఆర్ బాండ్లు ఇవ్వలేదని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ జోక్యం చేసుకుని వివాదాలతో విచారణ ఎదుర్కొంటున్న వాటిని పక్కనపెట్టి తక్కిన వాటికి టీడీఆర్ బాండ్లు ఇవ్వాలని సూచించారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ టీడీఆర్ బాండ్ల జారీపై కసరత్తు జరుగుతోందని, త్వరలోనే అందజేస్తామని అన్నారు. ఆకుతోట వీధిలో మురుగు కాలువలు శుభ్రం చేయాలని, కోటకొమ్మల వీధిలో సెట్‌బ్యాక్స్ లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని, ఉపాధ్యాయ నగర్‌లో కుక్కల సమస్య పరిష్కరించాలని, భవానీనగర్‌లో యూడీఎస్ సమస్య పరిష్కరించాలని, సాయి విష్ణు లేఅవుట్‌లో కాలువలు నిర్మించాలని, రవీంద్ర నగర్‌లో రోడ్లు, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని ప్రజలు వినతులు సమర్పించారు. కార్యక్రమంలో ఏడీసీ చరణ్‌తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈలు తులసికుమార్, గోమతి, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, ఆర్వోలు సేతుమాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర పాల్గొన్నారు.

ఏపీకి పూర్వవైభవం తథ్యం

తిరుపతి (జీవకోన), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీకి పూర్వవైభవం తథ్యమని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ప్రధాని మోదీ ఏపీ పర్యటనలో భాగంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఏపీలో ఐదేళ్లపాటు అలుముకున్న చీకటి రోజులు తొలగిపోయి రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తోందని వివరించారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం సఫలీకృతమైందని, దీంతో ప్రతిపక్షాల తప్పుడు ప్రచారానికి చెక్ పడిందని తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం


రమాకాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వేలూరు విట్ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగ పరిశోధకుడు బి.రమాకాంత్ రెడ్డి డాక్టరేట్ పొందారు. ఏ ఫ్రేమ్ వర్క్ ఫర్ హెల్త్ కేర్ ప్రొడక్ట్ క్లాసిఫికేషన్ అండ్ పర్సనలైజ్డ్ రెకమెండేషన్స్ త్రూ డీప్ లెర్నింగ్ మోడల్స్ అంశంపై డాక్టర్ లోకేష్‌కుమార్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. తిరుపతిలోని ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజీలోనూ పదేళ్లపాటు అధ్యాపకుడిగా పనిచేశారని విట్ అకడమిక్ డీన్ అరుళ్ తెలిపారు.

ఏపీఐఐసీ జోనల్ మేనేజరు బాధ్యతల స్వీకరణ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీఐఐసీ జడ్ఎం విజయభరత్‌రెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్‌గా సోమవారం విజయభరత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కుష్ఠువ్యాధి నిర్ధారణ పరీక్షలు

తిరుపతి అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానికులకు కుష్ఠువ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు చేస్తారు. సోమవారం మంగళం క్వార్టర్స్‌లో పరీక్షలు చేశారు. అసిస్టెంట్ డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీకృష్ణ పర్యవేక్షించారు. విధిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

టీటీడీ విశ్రాంత ఉద్యోగులకు లైఫ్ సర్టిఫికెట్లు

తిరుపతి అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): టీటీడీ విశ్రాంత ఉద్యోగులకు లైఫ్ సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు పెన్షనర్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీటీడీ పరిపాలన భవనం క్యాంటీన్ పక్కనున్న కార్యాలయంలో ఈనెల 31వ తేదీ వరకు మంజూరు చేస్తామని, విశ్రాంత ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రమాదాలకు చెక్ పెట్టండి


కలెక్టర్‌ను కలిసిన డీపీటీవో నరసింహులు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రమాదాలు జరగకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రజారవాణాధికారి జి.నరసింహులును ఆదేశించారు. ఇన్‌చార్జ్ డీపీటీవోగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నరసింహులు సోమవారం మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ మధ్య ఘాట్ రోడ్డుతో పాటు హైవేలోనూ ఆర్టీసీ బస్సులు ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలిపారు. వీలైనంత వరకు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తగు చర్యలు తీసుకుంటామని డీపీటీవో చెప్పారు.

కులగణన అనంతరమే వర్గీకరణ జరగాలి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన జరిగిన అనంతరమే వర్గీకరణ రిజర్వేషన్లు జరగాలని దళిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ ఏకసభ్య కమిషన్ 2011లో తీసిన జనాభా లెక్కల మేరకు కులవర్గీకరణ చేయడం తగదన్నారు. తాజాగా జనాభా లెక్కలు తీసిన తర్వాత కులాల వర్గీకరణ చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థల్లో బ్యాక్‌లాగ్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నేతలు ఆంజనేయులు, గోపాలయ్య, కె.గోపి, దేవేంద్ర పాల్గొన్నారు.

రైతు నాయకుడు దల్లేవాల్‌ను కాపాడండి


ఎంపీ గురుమూర్తికి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారం కోసం ఆమరణ దీక్ష చేస్తున్న దల్లేవాల్‌ను కాపాడాలని రైతు సంఘం నాయకులు మాంగాటి గోపాల్‌రెడ్డి, పి.హేమలత, ఆర్.వెంకయ్యలు కోరారు. ఈ మేరకు సోమవారం తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి నివాసానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఆమరణ దీక్షతో దల్లేవాల్‌కు ప్రాణాపాయం ఉందని, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి.వెంకటరత్నం, పద్మనాభరెడ్డి, చలపతి పాల్గొన్నారు.

డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, పద్మావతి డిగ్రీ కాలేజీకి చెందిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు ఇందుకు సంబంధించిన ఫలితాలను విడుదల చేశారు. ఈ కాలేజీలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించిన నేపథ్యంలో తొలిసారిగా స్వయంగా కాలేజీలే పరీక్షలు నిర్వహించి, ఫలితాలను ప్రకటించాయి. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు 54.2 శాతం, పద్మావతి డిగ్రీ కాలేజీ విద్యార్థులు 81 శాతం ఉత్తీర్ణత సాధించారు.


ఆలయం ముందు అశ్విన్‌బాబు, బాబీ, తమన్

స్వామివారు.. పెద్ద బ్లాక్‌బస్టర్ ఇచ్చారు

'డాకు మహారాజ్' దర్శకుడు బాబీ

తిరుమల, జనవరి20(ఆంధ్రజ్యోతి): 'డాకు మహారాజ్'తో శ్రీవేంకటేశ్వరస్వామి చాలా పెద్ద బ్లాక్‌బస్టర్ ఇచ్చారని ఆ చిత్ర దర్శకుడు బాబీ సంతోషం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు తమన్, నటుడు అశ్విన్ బాబుతో కలిసి ఆయన సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రెండేళ్ల క్రితం 'వాల్తేరు వీరయ్య' సినిమాతో వచ్చామని, అప్పుడూ స్వామివారు మంచి విజయాన్ని ఇచ్చారన్నారు. తాజాగా 'డాకు మహారాజ్'ను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి థ్యాంక్స్ చెబుతున్నానన్నారు. తొలి నుంచే ఈ సినిమాపై చాలా ఆశలు పెట్టుకున్నామని తమన్ అన్నారు. అందుకే స్వామికి థ్యాంక్స్ చెప్పేందుకు వచ్చామన్నారు. శ్రీవారి ఆశీస్సులు లేకుండా ఏదీ ప్రారంభించనన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.68 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,826

తలనీలాలు సమర్పించినవారు: 22,625







పిల్లల కేరింతలు..

పిట్టల కిలకిలలు..
















కళకళలాడిన నేలపట్టు

చెరువు కట్టల మీద విద్యార్థుల కేరింతలూ.. చెరువులోని చెట్లమీద పిల్లపక్షుల కిలకిలలూ.. ఫ్లెమింగో ఫెస్టివల్ మూడోరోజున నేలపట్టు కళకళలాడింది. రకరకాల యూనిఫారాల్లో ఎటు చూసినా పిల్లలే సందడిగా కనిపించారు. చెరువులోని చెట్లమీద రకరకాల పక్షి పిల్లలు ముక్కులతో పొడుచుకుంటూ, రెక్కలు విప్పుకుని ఎగరడం నేర్చుకుంటూ, చెరువులో వాలి జలకాలాటలాడుతూ అలరించాయి. సెప్టెంబరు నుంచీ వివిధ దేశాల నుంచీ విడతలవారీగా వస్తున్న పక్షులు ఈ చెట్లమీద గూళ్లు పెట్టుకుని, సహచరులను ఆకర్షించి జతకట్టి, గుడ్లుపెట్టి పొదిగాయి. ఇప్పుడీ పిల్లలు రెండు నెలల వయసుకు చేరుకున్నాయి. బుజ్జి పిట్టల బొజ్జనింపి బువ్వపెట్టేందుకు అమ్మ పక్షులు ఆహారం వెతుకుతూ వెళ్లిపోయాయి. ఈ పిల్ల పిట్టలు ఎండకు రెక్కలార్చుకుంటూ, ముక్కులు పదును పెట్టుకుంటూ గడుపుతున్నాయి. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌లు తమ కెమెరాల్లో బంధించారు.

ఘనంగా జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్


మూడు రోజులూ పోటెత్తిన జనం











ఉల్లాసంగా ఉత్సాహంగా పడవల్లో..



తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పక్షుల పండుగ చివరిరోజు సోమవారం పర్యాటకులతో పులికాట్ సరస్సు పులకించిపోయింది. పెద్ద సంఖ్యలో పర్యాటకులు విద్యార్థులు పడవ షికారుకు ఉత్సాహం చూపారు. కాళహస్తి, గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి పరిసర ప్రాంతాల నుంచి పాఠశాలల విద్యార్థులు ప్రత్యేక బస్సుల్లో పడవ షికారుకు వచ్చారు. పులికాట్ తీరాన నీళ్లలో ఉత్సాహంగా గంతులు వేశారు. ఇక్కడి వేదికమీద స్థానిక విద్యార్థులతో పాటు కొందరు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చివరిరోజున సాయంత్రం 6 గంటల వరకు పడవ షికారు జరిగింది.

పడవ షికారు అద్భుతం



పులి కాట్‌లో పడవలో తిరగడం ఆనం దంగా ఉంది. ఎటు చూసినా నీళ్లే. ఇదే తొలిసారి నేను పడవ ఎక్కడం. నేలపట్టులో పక్షులను చూసి ఇక్కడికి వచ్చాం. ఎన్ని పక్షులో అక్కడ!

- తేజశ్విని, 6వ తరగతి, పెద్దకన్నలి, తొట్టంబేడు మండలం

సూళ్లూరుపేటలో సందడే సందడి

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ చివరిరోజు పర్యాటకులతో కళాశాల మైదానం సందడిగా కనిపించింది. పలు ప్రాంతాల విద్యార్థులు, పర్యాటకులు స్టాల్స్‌ను చూస్తూ ఎంజాయ్ చేశారు. ముఖ్యంగా షార్ రాకెట్‌లను చూస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం సైతం పర్యాటకుల కోసం పూర్తి స్థాయిలో బస్సులు ఏర్పాటు చేయలేకపోయారు. దీంతో ఆటోలే దిక్కుఅయ్యాయి. కళాశాల మైదానం చుట్టుపక్కల రోడ్లను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఆటల వేదికలా అటకానితిప్ప


పర్యావరణం కాపాడటంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఓజిలి/సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అటకానితిప్ప ప్రాంతంలో పక్షులను చూసేందుకు సోమవారం విద్యార్థులు, సందర్శకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. సత్యవేడు, పల్లమాల, బాకరాపేట, పలమనేరు, చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వందలాదిగా విద్యార్థులు తరలిరావడంతో అటకానితిప్ప కిటకిటలాడిపోయింది. ఇక్కడ పిల్లల వినోదం కోసం ఏర్పాటు చేసిన ప్రదేశంలో ఆటల్లో పిల్లలు సందడిగా గడిపారు. పక్షుల ప్రదర్శనశాలలో పులికాట్, అటకానితిప్ప, నేలపట్టు, సమీప ప్రాంతాల విశిష్టతపై ప్రదర్శించిన ఫిల్మ్‌షోను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. విద్యార్థుల సందేహాలకు సిబ్బంది సమాధానాలు ఇచ్చి మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, పక్షులపై అవగాహన కల్పించారు. ఈ ప్రాంతానికి సమీపంలో పులికాట్‌లో నీరు ఎండిపోవడంతో పక్షులు దూరంగా వెళ్లిపోవడంతో సందర్శకులు ఒకింత నిరాశకు గుయ్యారు.

సంతోషంగా ఉంది



ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రావడం వల్ల చాలా తెలుసుకున్నాం. అటకానితిప్పలో ఫిల్మ్‌షో చాలా బావుంది. బీవీపాళెం రేవులో పడవ ప్రయాణం వింత అనుభూతిని ఇచ్చింది.

- టి నందిని, 10వ తరగతి, ఇరుగుళం స్కూల్, సత్యవేడు మండలం.







అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్

తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కార్యక్రమాలతో జనం ఉర్రూతలూగారు. బుల్లితెర యాంకర్లు రవి, కావ్య, అమూల్య మాటల గారడీలతో ఆకట్టుకోగా.. మిమిక్రీ రాజు తన మిమిక్రీతో జనాలను కట్టిపడేశారు. మల్కట్‌సింగ్ చేసిన నృత్య ప్రదర్శన అబ్బురపరచింది. సినీ గాయని మంగ్లీ తన ఆటపాటలతో జనాలను హుషారెత్తించారు.

ప్రకృతిని.. సంస్కృతిని తల్లిలా చూడాలి

ముఖ్య అతిథిగా వచ్చిన సినీ హీరోయిన్ సంయుక్త మీనన్ 'హాయ్' అంటూ సభికులను పలకరించారు. ప్రకృతి, సంస్కృతిని తల్లిలా చూడాలన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం మన బాధ్యతన్నారు. వాటర్ బాటిల్ పారవేయడం తేలికని, దాని ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని గుర్తించాలన్నారు. మరో సినీ హీరోయిన్ కృతిశెట్టి మాట్లాడుతూ.. మన సంస్కృతిని ఎన్నో దేశాలు ఆహ్వానిస్తుంటాయని, మనంకూడా సోషల్ మీడియాలో దీనిని బాగా ప్రమోట్ చేసేలా కృషి చేయాలని కోరారు.



వైద్య పరీక్షలు పక్కాగా నిర్వహించండి

తిరుపతి(వైద్యం), జనవరి 20(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా చిన్నపాటి వ్యాధులతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్య పరీక్షలు తప్పక నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి బాలకృష్ణనాయక్ అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ క్యాలెండరును ఆవిష్కరించారు. రోగులకు వైద్యం అందించడంలో రక్త పరీక్షలు ప్రధానమని, వాటిని పక్కాగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు వినయ్, హరి, శ్రీకాంత్, ప్రభు పాల్గొన్నారు.

సామాజిక సేవ చేయాలనుంది

మిస్ గ్లోబల్ భావనారెడ్డి



తిరుపతి(ఆటోనగర్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తానని మిస్ గ్లోబల్ పి.భావనారెడ్డి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ బాల్యం నుంచే అన్ని రంగాల్లో రాణిస్తున్నానని తెలిపారు. ఫ్యాషన్ రంగంలో రాణించాలన్న తన సంకల్పం ఫలించిందన్నారు. దేశం గర్వించే స్థాయికి ఎదగాలన్న ఆకాంక్ష ఉందన్నారు. తాను స్థాపించిన మిత్రా ఫౌండేషన్ సంస్థ ద్వారా సామాజిక సేవ చేస్తామని చెప్పారు. త్వరలోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కొల్లు రవీంద్రలను కలసి తాను చేపట్టబోయే సేవా కార్యక్రమాల గురించి వివరిస్తానన్నారు. సమావేశంలో ఆమె తండ్రి గోపీకృష్ణ, పి.మోహన్‌రెడ్డి, రాజేష్‌లు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

భూ రీ సర్వే ప్రారంభం



రీసర్వేను ప్రారంభిస్తున్న సర్వేయర్లు

పుత్తూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూ రీ సర్వేను పరమేశ్వరమంగళంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. మండల సర్వేయర్ శేషమరాజు ఆధ్వర్యంలో సచివాలయ సర్వేయర్లు తొలుత రెవెన్యూ గ్రామ సరిహద్దులను కొలతలను తీస్తున్నారు. రికార్డుల ప్రకారం గ్రామంలో 1717 ఏకరాలు సుమారు 900 మంది రైతుల పేరిట ఉన్నట్టు మండల సర్వేయర్ తెలిపారు. నెల రోజుల పాటు జరిగే ఈ రీ సర్వేలో అంచెలంచెలుగా భూములను సర్వే చేస్తామని ఆయన తెలిపారు. కాగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 660 అర్జీల్లో ఇప్పటికే 330 వినతులను పరిష్కరించినట్టు తహసీల్దార్ చెప్పారు. మరో 30 రోజుల్లో మిగతా వాటిని పరిష్కరిస్తామన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాల ఏర్పాటు

వడమాలపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎం పురం, అప్పలాయగుంటల్లో ప్రత్యేక అధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు చెప్పారు. ఈ నెల 21, 22 తేదీల్లో ఏఎం పురం, 23, 24 తేదిల్లో అప్పలాయగుంట సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమర్థవంతంగా టీడీపీ సభ్యత్వ నమోదు



వడమాలపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో సమర్థవంతంగా నిర్వహించినట్లు చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు చెప్పారు. మండలంలోని రామసముద్రంలో చివరిరోజు సోమవారం సభ్యత్వ నమోదు చేయించారు. ప్రజలు స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదు చేయించుకున్నారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. అనంతరం గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

మందుబాబులకు అడ్డాగా రైతు సేవా కేంద్రం



కేవీబీపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతు సేవా కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రి వేళల్లో, సెలవు దినాల్లో మందుబాబులు ఇక్కడ మద్యం తాగి తరువాత సీసాలను పగులగొట్టడమే కాకుండా ఆహార వ్యర్థాలు అక్కడే చిందరవందర చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

ఏర్పేడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిల్లారిగుంట కాలనీలో ఎస్టీ మహిళలకు సోమవారం రవిరాల్ల(స్పెయిన్) ఆర్థిక సాయంతో షేర్ జీసెస్ వర్డ్ మినిస్ట్రీస్ ట్రస్టు అధ్యక్షుడు జోసెఫ్ ఆధ్వర్యంలో టైలరింగ్ ఉచిత శిక్షణ ప్రారంభించారు. శిక్షణ అనంతరం కుట్టు మెషిన్ అందించనున్నారు. గంగమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, కార్యదర్శి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని కార్మికుడికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వలస కార్మికుడు దిల్షాద్(30) తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు వద్ద జాతీయ రహదారి ఫ్లైవోవర్‌పై సోమవారం జరిగింది. ఉత్తరప్రదేశ్‌కి చెందిన దిల్షాద్ రోడ్డు నిర్మాణ సంస్థలో కార్మికుడు. ఈ క్రమంలో సోమవారం ఫ్లైవోవర్‌పై పనిచేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దుప్పట్ల వితరణ

గూడూరు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణం, రూరల్ పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కు దుప్పట్లను సోమ వారం అందజేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చలికాలంలో పేదలకు ఉప యోగపడేలా పాస్టర్ల అసోసియేషన్ దుప్పట్లను అందజే యడం అభినంద నీయమని, వీటిని పేదలకు అందజే స్తామన్నారు. కార్యక్రమంలో పాస్టర్ల అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా రత్నశేఖర్, డేవిడ్, ఇస్సాకు, దొరరాజు, యోహను, విజయకుమార్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

సూళ్లూరుపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బావిలో దూకి ఆత్మహత్య చేసుకొన్న అన్నపూర్ణ, చెరువులో పడి మృతి చెందిన ప్రసాద్ కుటుంబ సభ్యులను టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏజీ కిషోర్, పాముూరు మునస్వామి, వెంకీ యాదవ్, ఏడుకొండలు, ఆలీబాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్

కోట, జనవరి 20 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధి లోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజ నీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ములుమూడి రాజేష్‌కు డాక్టరేట్ లభించింది. ఏఐ ఎనేబుల్డ్ పవర్ క్వాలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ ఇన్ రెన్యూబుల్ ఇంటిగ్రేటెడ్ చాందా ఎలోన్ సిస్టమ్స్ అనే అంశంపై తిరుపతి లోని వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీదేవి పర్యవేక్షణలో రాజేష్ పరిశోధనలు చేశారు. సోమవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ప్రశంసాపత్రాలు, షీల్డ్‌లతో రాజేష్‌ను అభినందించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి



స్టాల్స్ వద్ద బీఎన్‌కండ్రిగ మండలం పల్లమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు



జింకల పార్కు వద్ద విద్యార్థుల సందడి



పడవలరేవు వద్ద పెద్దకన్నలి ఉన్నత పాఠశాల విద్యార్థుల సందడి

పిల్లల ప్రపంచంలా పక్షుల కేంద్రం

నేలపట్టుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులు

దొరవారిసత్రం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ మూడో రోజున నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం అంతా విద్యార్థుల లోకంగా మారింది. జిల్లా కలెక్టర్ చొరవ మేరకు తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠ శాలల విద్యార్థులను ఉపాధ్యాయులు నేలపట్టుకు తీసుకు వచ్చారు. గూళ్లలో ఉన్న పక్షులను బైనాక్యులర్స్ ద్వారా చూస్తూ విద్యార్థులు కేరింతలు పెట్టారు. ఓవైపు రకరకాల యూనిఫాంలో విద్యార్థుల చప్పుళ్లు, మరోవైపు పక్షుల కిలకిల రావాలతో నేలపట్టు సందడిగా మారింది. సోమవారం సుమారు 5 వేల మంది విద్యార్థులు నేలపట్టును సందర్శించినట్టు అంచనా. కుటుంబాలుగా వచ్చిన వారు చెట్లకింద భోజనాలతో సంబరంగా గడిపారు.

చుక్కల జింకలతో...

ఇక్కడి జింకల పార్కులోని చుక్కల జింకలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. పిల్లలకు దగ్గరగా ఉండేలా వాటికి మేత పెట్టడంతో కంచెకు దగ్గరగా అవి వచ్చి కనువిందు చేశాయి.

బోసిపోయిన వేదిక

నేలపట్టులో పెలికాన్ అతిథి గృహాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాల కోసం వేదిక ఏర్పాటు చేశారు. అయితే కళాకారులు లేకపోవడం, స్థానిక పాఠశాలల విద్యార్థులచే మొక్కుబడి డాన్సులు చేయించడంతో ఈ ప్రాంగణం బోసిపోయింది.

సమన్వయంతో పక్షుల పండుగ విజయవంతం: విజయశ్రీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వ యంతో విజయవంతంగా నిర్వహించామని సూళ్లూరు పేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. మూడు రోజుల పాటు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసిన జిల్లా అధికాయ యంత్రాంగాన్ని ఆమె అభినం దించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని తక్కువ కాలంలోనే అన్ని పనులు పూర్తి చేసి పక్షుల పండుగను విజయవంతంగా నిర్వహించారన్నారు. వైసీపీ పాలనలో ఆగిపోయిన పక్షుల పండుగను మళ్లీ నిర్వహించేందుకు అడిగిన వెంటనే అనుమతులు ఇవ్వడమే కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించడం సంతోషకరని, ఇక పై ఏటా పక్షుల పండుగ నిర్వహించేలా చర్యలు తీసుకుంటా మన్నారు.

పర్యాటక రంగానికి పెద్దపీట: సోమిరెడ్డి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. టీడీపీ హయాంలో పులికాట్, నేలపట్టు ప్రాంతాలను అభివృద్ధి చేశామన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందన్నారు.

పర్యాటకానికి అనువైన ప్రదేశం: కలెక్టర్

సూళ్లూరుపేట ప్రాంతం పర్యాటక రంగానికి అనువైన ప్రదేశమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఫ్లెమింగో ఫెస్టివల్ అందరి సహకారంతో విజయవంతం చేశామని ఆనందం వ్యక్తం చేశారు. పోలీసుల సహకారంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు కూడా జరగకుండా మూడు రోజులు పాటు విజయవంతంగా ముగిసిందన్నారు. సూళ్లూరుపేటను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అన్ని చర్యలు తీసుకొంటామన్నారు.

నేలపట్టు అధికారులకు కలెక్టర్ అభినందనలు



వాచ్‌టవర్‌పై నుంచి బైనాక్యులర్ ద్వారా పక్షులను చూస్తున్న కలెక్టర్

దొరవారిసత్రం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహణలో నేలపట్టులో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో పనిచేసి విజయవంతం చేసిందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన నేలపట్టుకు ఇన్‌చార్జి అధికారిగా వ్యవహరించిన గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలసి చెరువు కట్టలపైకి వెళ్లి పక్షులను వీక్షించారు. చివరి వాచ్‌టవర్ వద్దకు చేరుకోని బైనాక్యులర్ ద్వారా తిలకించారు. తహసీల్దారు శైలాకుమారి, ఎఫ్ఆర్వో సౌజన్య, ఎస్ఐ అజయ్‌కుమార్, అటవీశాఖ సిబ్బందిని ఆయన అభినందించారు.

ఎమ్మెల్యే పరిశీలన

పక్షుల పండుగ మూడో రోజున అధికారుల ఏర్పాట్ల తీరును ఎమ్మెల్యే విజయశ్రీ మండల నాయకులతో కలిసి పరిశీలించారు. మూడు రోజులూ భారీగా జనం వచ్చారని, ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పూర్తిస్థాయిలో అధికారులు విజయవంతం చేశారని ఆమె అభినందించారు.

వైసీపీ నేతల గుప్పిట్లో ఉన్న
ప్రభుత్వ భూములను పేదలకు పంచుతాం: టీడీపీ



కేశవరంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు, గ్రామస్తులు

కోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కేశవరం పంచాయతీలో ఇద్దరు వైసీపీ నేతల గుప్పిట్లో ఉన్న ప్రభుత్వ భూములను ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో భూమిలేని పేదలకు పంపిణీ చేస్తామని టీడీపీ నాయకులు తెలిపారు. సోమవారం వారు గ్రామస్తులతో కలసి ఆక్రమిత భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేశవరం, రాఘవాపురం, గ్రామాల్లో ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఇద్దరు వైసీపీ నేతల గుప్పిట్లో ఉన్నాయన్నారు. కేశవరంలోని సర్వే నెంబరు 309లో 18 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించి మామిడి, జామాయిల్ సాగు చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా గిరిజనులకు చెందిన అసైన్డ్ భూములను కూడా లబ్ధిదారులకు తెలియకుండానే వాణిజ్య బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందారని ఆరోపించారు. ఆ భూములను నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు పంచి పెడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు చాపల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కోటేశ్వర ప్రసాద్, అధికార ప్రతినిధి జడ వేణు, నాయకులు భూపతి, చిట్టేటి నాగూరయ్య, సాగునీటి సంఘం అధ్యక్షుడు బత్తల బాబు, వెంకటేశ్వర్లు, మాతయ్య పాల్గొన్నారు.

వరిలో దోమ పోటు



వరిలో దోమ పోటు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

పెళ్లకూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలో సుమారు 15 వేల ఎకరాల్లో బీపీటీ 5201, కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048 తదితర సన్న రకాల వరిని రబీ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్నారు. నాట్లు వేసినప్పటి నుంచి ముసురుతో కూడిన వర్షాలు పడుతుండడంతో పంట తెగుళ్ల బారీన పడింది. అనేక రకాల పురుగు మందులు పిచికారీ చేయడంతో పంటలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. అయితే వాతావరణ మార్పుల కారణంగా పొగమంచు అధికంగా కురుస్తుండడంతో వరి పైరుకు దోమ పోటు తీవ్రంగా ఉంది. దోమ పోటు నివారణకు వాడే పురుగు మందుల ధరలు ఇటీవల భారీగా పెరిగాయి. ఈ క్రమంలో ఇంకా నెల రోజుల పాటు పంటలను కాపాడుకోవడానికి ఎంత పెట్టుబడి పెట్టాలోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేత జట్టుకు నగదు బహుమతి, ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

చిల్లకూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతుందని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. సోమవారం తీపనూరు - ఓడూరు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేత జట్టుకు ఎమ్మెల్యే నగదు, ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గుండాల లీలవతి, శ్రీనివాసులు, చిట్టేటి కీరవాణి, పిచ్చిరాజు, రాఘవలు, లీలాకుమార్ పాల్గొన్నారు.

పేదలకు రెండు సెంట్ల భూమి ఇవ్వండి



అర్జీలు స్వీకరిస్తున్న కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరిటౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్లు పేదలకు రెండు సెంట్లు భూమి ఇవ్వాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య అన్నారు. సోమవారం 8వ వార్డు సచివాలయంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యలను అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామన్నారు.

గ్రామాల్లో అక్షర వెలుగులు



అక్షరదీపిక పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కోఆర్డినేటర్ ప్రభాకర్, ఏపీఎం అనీల

కోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వయోజన విద్యాకేంద్రాల ద్వారా గ్రామాల్లో అక్షర వెలుగులు నింపడమే లక్ష్యమని ఏరియా కోఆర్డినేటర్ ప్రభాకర్ అన్నారు. కోటలోని వెలుగు కార్యాలయంలో సోమవారం వుల్లాస్ శిక్షణ కార్యక్రమం జరిగింది. అంతకుముందు వయోజనులకు బోధించే పుస్తకాలను కోఆర్డినేటర్ ప్రభాకర్, ఏపీఎం అనీల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీల్లో 304 మంది నిరక్షరాసులను గుర్తించామని, వారి కోసం 30 అక్షర కేంద్రాలను ఏర్పాటు చేసి అక్షరాసులుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సీసీలు ప్రసాద్, భాస్కర్, శంకర్, శ్రీకాంత్, బిందు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

కోట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కోటలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్స్ క్యాలెండర్‌ను తహసీల్దారు జయజయరావు ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందాటి రామశెట్టి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ నారాయణరావు, సుబ్బారెడ్డి, ఆర్ఐ మధులత తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న తహసీల్దారు, రిటైర్డ్ టీచర్స్

గణతంత్ర వేడుకలకు ఎన్‌బీకేఆర్ విద్యార్థులు



గణతంత్య్ర వేడుకలు ఎంపికైన విద్యార్థులు గాయత్రి, హరికృష్ణ

కోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న గాయత్రి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న హరికృష్ణ ఈ నెల 26న విజయవాడలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఎంపికయ్యారు. వీరు సీఎం చంద్రబాబు నాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ సమక్షంలో జరిగే కవాతులో పాల్గొంటారు. సోమవారం ఆ విద్యార్థులను డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, విభాగాధిపతులు అభినందించారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

కోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 22నుంచి 30వ తేదీ వరకు జేఈఈ మెయిన్స్ పరీక్షలు జరుగుతాయి. సోమవారం తహసీల్దారు జయజయరావు, కళాశాలలో గదులు, ల్యాబ్‌లు, వసతులను పరిశీలించారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

చంద్రగిరి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రైలుపట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. శ్రీవారిమెట్టు మార్గంలో రైలు పట్టాలపై ఆదివారం రాత్రి సుమారు 20 నుంచి 25 సంవత్సరాల వయసున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు గుండుతో ఉన్నాడని, ఆధారాలు లభించలేదని రైల్వే ఎస్ఐ ప్రవీణ్ కుమార్ చెప్పారు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సమాచారం తెలిస్తే 9494228854, 9440416642 నంబర్లకు తెలియజేయాలని ఆయన కోరారు.



పక్షుల పండుగ ముగింపు కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు - తిలకిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, బొజ్జల సుధీర్ రెడ్డి, మాలకొండయ్య తదితరులు

పల్లికొండేశ్వరాలయ హుండీ లెక్కింపు



నాగలాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపులో రూ.9,34,990 వచ్చినట్లు ఆలయ ఈవో లత తెలిపారు. ఈ ఆదాయం గత 81 రోజులకు గాను భక్తులు హుండీలో సమర్పించిన కానుకలని తెలిపారు. అలాగే ఆలయ ఆవరణలో ని ర్వహించే అన్నదానం హుండీ ద్వారా రూ.1,39,971 వచ్చిందన్నారు. అదేవిధంగా 55 యుఎస్ డాలర్లు, 66 మలేసియా డాలర్లు, 10 కెనడా డాలర్లు, 16 సింగపూర్ డాలర్లు, 10 యుఏఈ దిర్హామ్స్ వచ్చాయి. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని తిరుపతి డివిజన్ తనిఖీ అధికారి ఫణిరాజ శయన పర్యవేక్షించారు.

పల్లె నుంచి ఢిల్లీ దాకా...

'ప్రధానమంత్రి పరీక్షా పే చర్చా'లో పాల్గొన్న శ్రీకర్‌కు ఎమ్మెల్యే అభినందన



శ్రీకర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్

శ్రీకాళహస్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మారుమూల పల్లెలో పుట్టి ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డంపై విద్యార్థి శ్రీకర్‌ను ఎమ్మెల్యే సుధీర్ అభినందించారు. మండలంలోని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి శ్రీకర్ ఇటీవల ఢిల్లీలో జరిగిన ప్రధానమంత్రి పరీక్షా పే చర్చా కార్య క్రమంలో పాల్గొన్నాడు. దీన్ని పురస్కరించుకుని సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని ఎమ్మెల్యే అభినందించారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజకుమారి, గైడ్ టీచర్, గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన వ్యక్తి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

పిచ్చాటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి కొడియంబేడులో ఈనెల 17న శుక్రవారం ఉదయం 10 గంటలకు దళితవాడకు చెందిన వెట్టి మనోహర్(68)పై పెట్రోల్ పోసి నిప్పంటించిన చిన్నతంబిని ఆదివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్వరులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దళితవాడకు చెందిన డేవిడ్‌రాజ్ కుమారుడు చిన్నతంబికి మనోహర్‌కి పాత కక్షలున్నాయి. ఈ నేపథ్యంలో డేవిడ్‌రాజ్ నడుపుతున్న అంగడికి సరకులు కొనడం కోసం వచ్చిన మనోహర్‌పై ప్లాస్టిక్ బాటిల్లో ఉన్న పెట్రోల్ పోసి చిన్నతంబి నిప్పంటించాడు. మంటల బాధకు తట్టుకోలేక బాధితుడు కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న వాళ్లు వచ్చి నీళ్లు చల్లి మంటలార్పారు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది దళితవాడకు చేరుకుని మనోహర్‌ను నగరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్నాడు. ఈ కేసులో పరారీలో ఉన్న చిన్నతంబిని ఆదివారం సాయంత్రం ఎస్‌ఎస్‌బీపేట చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ వెంకటేశ్వరులు సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని సోమవారం ఉదయం సత్యవేడు జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

బూట్ల కొలతల్లో తేడాలుంటే సవరించండి



కొలతలపై సిబ్బందికి సూచనలిస్తున్న సురేష్

శ్రీకాళహస్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బూట్ల కొలతల నమోదులో తప్పు లుంటే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వెంటనే సవరించు కోవాలని సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ సురేష్ అన్నారు. పట్టణంలోని పలు ప్ర భుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశా లలను ఆయన సోమవారం ఏఎల్‌ఎస్ కో ఆర్డినేటర్ శ్రీధర్‌తో కలిసి తనిఖీ చేశారు. కొన్ని పాఠ శాలల్లో విద్యార్థుల పాదాల కొలతలను అంగు ళాల్లో తీసి సెంటీమీటర్లలోకి మార్పు చేయడంలో తప్పులు దొర్లినట్లు గుర్తించారు. తప్పులుంటే యాప్‌లో వెంటనే సవరించాలని సూచించారు.

ఆగమోక్తంగా వినాయక ఆలయ కుంభాభిషేకం



పుష్పాలంకరణలో వినాయక ఆలయం - హోమం నిర్వహిస్తున్న రుత్వికులు



వినాయకుడికి ప్రత్యేక అలంకరణ

శ్రీకాళహస్తి,జనవరి 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరా లయానికి అనుబంధంగా విజ్ఞానగిరి వద్ద కొలువై ఉన్న వినాయక ఆలయ మహాకుంభాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ మండపాన్ని పునర్నిర్మించడంతో ఈ పూజలు చేశారు. కలశ స్థాపన చేసి వినాయక పూజ, హోమం నిర్వహించారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది. ఆలయ అధికారులు లోకేష్‌రెడ్డి, హేమమాలిని, ప్రధాన అర్చకుడు కరుణాకర్ గురుకుల్, అర్చకుడు శ్రీనివాస్ గురుకులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఉన్న వాహనమండపంలో కూడా వినాయక ఆలయ కుంభాభిషేకం నిర్వహించారు.

నాగంపల్లిలో ప్రబలుతున్న డెంగ్యూ?



నాగంపల్లిలో రోడ్డుపై పారుతున్న మురుగు

ఏర్పేడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నచ్చనేరి పంచాయతీ నాగంపల్లిలో ఇంటికొకరు చొప్పున జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. ఇందులో పలువురు డెంగ్యూతో బాధపడుతున్నారు. నాగంపల్లిలో సుమారు 150 కుటుంబాలున్నాయి. ఐదు వీధులున్నా మురుగు కాలువలు లేవు. దీంతో ఇళ్లల్లోని వ్యర్థపు నీరంతా వీధుల్లో ప్రవహిస్తోంది. వ్యర్థపునీటిపై దోమలు వృద్ధి డెంగ్యూ, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. పలువురు గ్రామస్తులు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్సలు పొందుతున్నారు. వారం రోజులుగా జ్వరాలు ప్రబలుతున్నప్పటికీ వైద్యసిబ్బంది పట్టించుకోకపోవడంతో సోమవారం ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన చర్యలు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ

ఏర్పేడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం నుంచి సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంపీడీవో సౌభాగ్యమ్మ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ సిబ్బందితో ఆమె సమీక్షించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రికార్డుల తనిఖీ జరుగుతుందన్నారు. ఏపీవో దేవరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

ఏర్పేడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరస్వామిని కోయంబత్తూరుకు చెందిన సంజయ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ నారాయణకుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి వారు రూ.25వేలు విరాళంగా అందజేశారు.

అధ్వానంగా సద్యోముక్తి స్థానం



సద్యోముక్తిలో ఉన్న నీటిలో తేలియాడుతున్న ప్లాస్టిక్ కవర్లు

శ్రీకాళహస్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఉన్న పవిత్ర సద్యోముక్తి స్థానం అధ్వానంగా మారింది. నదిలో యేటా మాఘ పూర్ణిమ రోజున ఇక్కడ సద్యోముక్తి వ్రతం, త్రిశూల స్నానం నిర్వహిస్తారు. మహాశివరాత్రి ఉత్స వాలకు ముందు జరిగే ఈ వేడుకకు వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. దీంతో ఈ స్థానాన్ని పవిత్రంగా భావిస్తారు. మరో రెండు వారాల్లో ఇక్కడ త్రిశూల స్నాన ఘట్టం జరగనుంది. ఇలాంటి సమయంలో ఈ ప్రదేశం అధ్వానంగా దర్శనమివ్వడంతో కొందరు భక్తులు ఆ చిత్రాలను సోమవారం సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి అధికారుల తీరుపై ఆవేదన చేయడం చర్చనీయాంశంగా మారింది.

నాగంపల్లిలో భూముల రీసర్వే

ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్



నాగంపల్లి భూముల మ్యాపును రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఏర్పేడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నచ్చనేరి పంచాయతీ నాగంపల్లిలో భూ రీ సర్వేను సోమవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగంపల్లివాసులు, రైతులు మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో తమ భూములను అక్రమంగా స్థానిక వైసీపీ నేతలు బినామీ పేర్లతో మార్చుకున్నారని చెప్పారు. భూమిని సాగు చేస్తున్నది మాత్రం తావే నన్నారు. వైసీపీ నేతలు భారీగా ప్రభుత్వ భూములతో పాటు టీడీపీ నేతల భూములను తారుమారు చేశారని చెప్పారు. వాటిని పరిశీలించి వైసీపీ ప్రభుత్వంలో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే సుధీర్‌ని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వెంటనే వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, అవినీతిపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. అలాగే తమ పార్టీ నాయకులు, కూటమి నేతలు తప్పు చేసినా క్షమించవద్దని తహసీల్దారు భార్గవిని కోరారు. అలాగే రీసర్వే రైతుల రికార్డుల ప్రకారం చేపట్టాలన్నారు. టీడీపీ నాయకులు ధనంజయులునాయుడు, పొన్నారావు, శివశంకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, నాగేశ్వరరావు, జయచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, డీటీ రోజారమణి, సీఐ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధి కోసమే పశు వైద్య శిబిరాలు

ఏర్పేడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పాడిరైతుల అభివృద్ధి కోసమే గ్రామీణ ప్రాంతాల్లో పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. మండలంలోని బండారుపల్లిలో శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. టీడీపీ నాయకులు గురవారెడ్డి, ధనంజయలునాయుడు, పొన్నారావు, శివశంకర్‌రెడ్డి, పశువైద్యాధికారి శిల్పారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. పశు వైద్య శిబిరాలు

కేవీబీపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపేడులో పశువైద్యాధికారి హరీస్ మణికంఠ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు ప్రారంభించారు. పశువులకు టీకాలు వేశారు. జోరీగ మందు కొట్టడం, బూటాక్స్ స్ప్రే చేశారు. నట్టల నివారణ, గాలికుంటువ్యాధి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, సర్పంచు బాలాజీ, వైస్ సర్పంచు గురునాథం, మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, నాగరాజురెడ్డి, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చాటూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని కారూరులో సోమవారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం జరిగింది. 31వ తేదీ వరకు మండలంలో శిబిరాలు జరుగుతాయని డాక్టర్ మంజుల తెలిపారు. కారూరు సర్పంచ్, పశు సంవర్ధకశాఖ సహాయకులు విజయకుమార్, హేమంత్, మోహన్, దామోదరం పాల్గొన్నారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పరాజపాలెంలో సోమవారం పశు వైద్య శిబిరాన్ని టీడీపీ నాయకుడు భాస్కరన్, సర్పంచు రమేష్ ప్రారంభించారు. పశువైద్యాధికారి భార్గవి, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ టీచర్లకు శిక్షణ

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలుగు కార్యాలయంలో నవభారత్ ఉల్లాస్ కార్యక్రమంలో వలంటీర్ టీచర్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో త్రివిక్రమరావు మాట్లాడుతూ నిరక్షరాస్యతను రూపుమాపాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నవ భారత్ ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులైన వారందరికీ అక్షరాలు నేర్పించాలన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన ధృవీకరణ పత్రాలు అందిస్తామని చెప్పారు. ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, ఏపీఎం మునెయ్య, సీసీలు పాల్గొన్నారు.

పిచ్చాటూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని 21 పంచాయతీల్లో 428 మంది అభ్యాసకులను నవభారత్ ఉల్లాస్ కార్యక్రమానికి గుర్తించినట్లు ఎంపీడీవో మహ్మద్ రఫీ, ఏపీఎం చంద్రకళ తెలిపారు. వయోజన విద్యా పాఠ్య పుస్తకాలను సంబంధిత వలంటీర్లకు అందించారు. ఏపీఎం రమాదేవి, వెలుగు సీసీలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

శ్రీకాళహస్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఒంటరి తనం తాళలేక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని ముత్యాలమ్మగుడి వీధికి చెందిన నెమలి పుంగాణి(60) బీడీ కార్మికుడు. ఇతనికి భార్య, పిల్లలు లేకపోవడంతో కొంతకాలంగా మనోవేదనకు గురయ్యాడు. ఇటీవల అనారోగ్య సమస్యలు కూడా వెంటాడటంతో కలత చెందాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పట్టణంలోని స్వర్ణముఖి నదిలో ఉన్న శ్మశానవాటికలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. సోమవారం స్థానికుల సమాచారంతో రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చ్యూరీకి తరలించారు.

రూ.కోటితో వారపు సంత అభివృద్ధి



సంత పరిసరాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

రేణిగుంట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వారపు సంతను కోటి రూపాయలతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. వారపు సంత సమస్యలపై ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే సోమవారం మధ్యాహ్నం వారపు సంత, ఆర్టీసీ బస్టాండు, దినసరి కూరగాయాల మార్కెట్, రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారపు సంతలో సిమెంటు రోడ్లు, మురుగు నీటి కాలువలు, మరుగుదొడ్లు, షెడ్లు, సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బస్టాండు పరిసరాల్లో అనధికార దుకాణాలను పూర్తిస్థాయిలో తొలగించి పార్కింగ్ స్థలాన్ని మరింత విస్తరించనున్నట్లు చెప్పారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, తహసీల్దారు సురేష్ బాబు, ఇన్‌చార్జి సీఐ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి మణి తదితరులు పాల్గొన్నారు.

కేటీ రోడ్డులో దిగబడిన కంటైనర్ లారీ



బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డ పదో మైలు రోడ్డు పక్కన తవ్విన గ్యాస్ పైపులైను గుంతలో సోమవారం కంటైనర్ లారీ దిగబడింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. రోడ్డు పక్కన గ్యాస్ పైపులైను కోసం భారీ గుంతను గమనించక పోవడంతో ఈ ఘటన జరిగింది. కంటైనర్ యాజమాన్యం భారీ క్రేన్లను రప్పించి వాహనాన్ని పక్కకు జరిపించింది. దీంతో రాకపోకలు సాఫీగా జరిగాయి.

టీడీపీ నేతకు ఎమ్మెల్యే నివాళి



పిచ్చాటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవికొడియంబేడుకు చెందిన టీడీపీ నాయకుడు ఎస్.శంకర్ అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం సోమవారం మధ్యాహ్నం అడవి కొడియంబేడుకు చేరు కుని శంకర్ భౌతికాయానికి నివాళుల ర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ, ప్రభుత్వం ఆదుకుంటామని భరోసా కల్పించారు.

పేడదిబ్బల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వీధులను పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాలేడు దళితవాడలో పేడ దిబ్బల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'పెద్దపాలేడు దళితవాడలో పారిశుధ్యం అధ్వానం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో త్రివిక్రమ రావు స్పందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, పంచాయతీ అధికారులతో గ్రామంలో పర్యటించారు. వీధుల్లో సిమెంట్ రోడ్డుపై వేసిన పేడదిబ్బలను తొలగించారు. వీధుల్లో పశువులను కట్టకూడదని సంబంధిత యజమానులకు సూ చించారు. గ్రామంలో ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు ఉండ టంపై మండిపడ్డారు. డాక్టర్లు దివాకర్, విద్యాసాగర్, సీహెచ్‌వో వెంక టేశ్వర్లు పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

ఇల్లు లేని పేదలు వివరాలు సమర్పించండి: ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలు వివ రాలు సమర్పించాలని ఎమ్మెల్యే సుధీర్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా స్థలం ఉండీ ఇల్లు నిర్మించుకోలేనివారు, ఇల్లు లేనివారు పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయ ఉద్యోగి మనోజ్ వద్ద వివరాలను సమర్పించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు వారి గ్రామాల్లో అనువైన ప్రదేశాలను గుర్తించి ఇస్తామని భరోసా ఇచ్చారు.

పింఛన్ల వివరాల సేకరణ



వివరాలు సేకరిస్తున్న అధికారులు

వరదయ్యపాళెం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ జబ్బులతో బాధపడుతూ మంచానికి పరిమితమైన పింఛనుదారుల వివరాలను అధికారులు సేకరించారు. మరదవాడ, ఇందిరానగర్, పాండూరు, చిన్న పాండూరు, మత్తేరిమిట్ట, బత్తలవల్లం సచివాలయ పరిధిలో 21మంది మంచానికి పరిమితమైన పింఛనుదారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం డాక్టర్ వినీల, డాక్టర్ మధుసూదన్‌రావు, వరదయ్యపాళెం వైద్యుడు ఉదయ్‌కుమార్, ఎంపీడీవో ప్రసాద్, ఏపీఎం సీతారాం పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌లో ఎమ్మెల్యే



శ్రీకాళహస్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సూళ్ళూరుపేటలో నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌కు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. మంత్రులతో కలిసి పలు కార్యక్రమాలను వీక్షించారు.

పక్షుల పండుగలో కల్లివెట్టు పాఠశాల విద్యార్థులు



బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల విద్యార్థులు సూళ్ళూరుపేటలో జరుగుతున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. నేలపట్టులో పక్షులను వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యా శాఖాధికారి కుమార్ విద్యార్థులకు పక్షుల రకాలను వివరించారు. పాఠశాల హెచ్‌ఎం రూపేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.